సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
దీపావళి శుభాకాంక్షలు
సోమవారం । 20 । అక్టోబర్ । 2025

వెలుగుల పండగ.. మది నిండుగ


కాకరొత్తులు కాలుస్తున్న చిన్నారులు

చీకటిని పారదోలుతూ కొత్త వెలుగులు నింపేందుకు దీపావళి పర్వదినం వచ్చేసింది. సోమవారం పండగను ఘనంగా జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమైపోయారు. ఆదివారం రాత్రి నుంచే ప్రతి ఇంట్లో సందడి మొదలైంది. దీపకాంతుల వెలుగుల్లో కొత్త శోభ సంతరించుకున్నాయి. దీపావళి పర్వదినాన సాక్షాత్తు మహాలక్ష్మి భూలోకానికి వచ్చి ఇల్లిల్లూ తిరుగుతుందని ప్రజల నమ్మకం. ఈ క్రమంలో అమ్మవారిని మనసారా కొలిచేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. ఇక.. ఆదివారం జిల్లావ్యాప్తంగా టపాసుల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. దుస్తులు, పండగ సామగ్రి, ఎలక్ట్రానిక్ షాపుల్లోనూ రద్దీ కన్పించింది. – సాక్షి నెట్‌వర్క్


మడకశిరలో పూల కొనుగోళ్ల సందడి

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు


ఉష శ్రీ చరణ్

పెనుకొండ రూరల్ : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు, అధికారులకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పండగ వేళ ప్రతి ఒక్కరి జీవితాల్లో అమావాస్య చీకట్లు తొలగిపోయి.. వెలుగులు నిండాలని పేర్కొన్నారు. సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో తులతూగాలని, మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

కాంతులు నింపాలి

పుట్టపర్తి టౌన్: చీకటిపై వెలుగు సాధించిన విజయానికి చిహ్నంగా జరుపుకొంటున్న దీపావళి అందరి జీవితాల్లో కాంతులు నింపాలని జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ ఆకాంక్షించారు. దీపావళి సందర్భంగా జిల్లా ప్రజలకు వారు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు.

మోసగాడిపై కేసు

రామగిరి: పింఛన్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బు వసూలు చేసి మోసగిస్తున్న టీడీపీ వర్గీయుడు సదాశివపై రామగిరి పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. రామగిరి మండలం దుబ్బార్లపల్లికి చెందిన సదాశివ తన పింఛన్ పునరుద్ధరింపజేస్తానంటూ రెండు విడతలుగా రూ.24 వేలు ఇప్పించుకుని మోసం చేశాడని రామగిరికి చెందిన శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సదాశివ ఆగడాలపై ఈ నెల 15న 'సాక్షి' దినపత్రికలో 'సదా మోసమే' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. కలెక్టరేట్ ఏఎస్ఓనని చెప్పుకుంటూ పలువురి నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డాడు. అనంతపురం, పెనుకొండ, హిందూపురం, పుట్టపర్తి తదితర ప్రాంతాలలో ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను, పింఛన్ ఇప్పిస్తానంటూ అమాయకులను మోసగించాడు. ఇప్పటికే ఇతనిపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

తాటిమానుగుంతలో తాగునీటికి కటకట


బోరుబావి వద్ద నీటికోసం ఎదురుచూస్తున్న మహిళలు

ఎన్పీకుంట మండలంలో మారుమూల గ్రామమైన తాటిమానుగుంతలో తాగునీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ బోరు మోటారు చెడిపోయి..పదిహేను రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో చాలా మంది వ్యవసాయ కూలి పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ క్రమంలో తాగునీటి కోసం పనులు మానుకుని బోరుబావుల వద్ద నీళ్లు వదిలినప్పుడు బిందెల్లో పట్టుకోవడానికి పోటీపడుతున్నారు. తమ పొలాలకు నీళ్లు వదులుకోవాలని రైతులు అభ్యంతరం చెబుతుండడంతో ఒక ట్రిండు బిందెలతో సర్దుకోవాల్సి వస్తోంది. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు. – ఎన్పీకుంట


వ్యవసాయ పొలంలో తాగునీటిని పట్టుకోవడానికి పోటీపడుతున్న గ్రామస్తులు

పేదింట ఉడకని కందిపప్పు



పండగకూ పప్పన్నం కరువే!

- చౌక ధరల దుకాణాల్లో ఆగిన పంపిణీ
- సరుకుల కోతతో కార్డుదారుల ఆక్రోశం
- బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180
- గోధుమ పిండి పంపిణీకి ఫుల్‌స్టాప్

➡ నల్లచెరువు మండలం తవళంమర్రికి చెందిన గంగులమ్మ కుటుంబం ప్రభుత్వం చౌక దుకాణం ద్వారా అందించే నిత్యావసర సరుకులపైనే ఆధారపడేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి దగ్గరకే సరుకులు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ వాహనాల్లేవు. రేషన్ దుకాణానికి వెళ్లినా.. బియ్యం తప్ప ఏవీ ఇవ్వడం లేదు. మార్కెట్‌లో అధిక ధర పెట్టి కందిపప్పు కొనలేని గంగులమ్మ కుటుంబం పచ్చడి మెతుకులతో సర్దుకుంటోంది.

➡ బుక్కపట్నం మండలం మారాలకు చెందిన నర్సమ్మ రోజువారీ కూలి. రేషన్ దుకాణాల్లో కందిపప్పు పంపిణీ చేయకపోవడంతో ఆ కుటుంబానికి పప్పన్నమే పరమాన్నమైంది. కనీసం పండగ పూట కూడా కందిపప్పు పంపిణీ చేయకపోవడంతో నర్సమ్మ సర్కార్‌పై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది.

కదిరి: కూటమి ప్రభుత్వం చౌక దుకాణాలకు కందిపప్పు సరఫరా చేయకపోవడంతో పేదల ఇంట పప్పు ఉడకడం లేదు. మరోవైపు మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.170 నుంచి రూ.180 దాకా పలుకుతోంది. దీంతో పేదలు అంత డబ్బు పెట్టి కొనలేక పచ్చడి మెతుకులతో సర్దుకుంటున్నారు. మరికొందరు మాత్రం వారంలో ఏదో ఓ రోజు పప్పుచేసుకుని పరమాన్నం వండుకున్నంత సంబరపడుతున్నారు.

జగన్ హయాంలో రూ.67కే కిలో కందిపప్పు

జిల్లాలో 1,367 రేషన్ దుకాణాలుండగా.. వాటి పరిధిలో 5,62,784 రేషన్ కార్డులున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 349 రేషన్ పంపిణీ వాహనాల (ఎండీయూ) ద్వారా కార్డుదారుల ఇంటివద్దకే వెళ్లి సరుకులు పంపిణీ చేసేది. ప్రతి నెల 8,700 మెట్రిక్ టన్నులు బియ్యం, 5,72,517 కిలోల కందిపప్పు, 5,72,517 కిలోల గోధుమ పిండి అందించేది. అలాగే ప్రతి కార్డుకు కిలో చొప్పున చక్కెర కూడా ఇచ్చేది. అప్పట్లో కందిపప్పు కిలో కేవలం రూ.67లకే రేషన్ దుకాణాల్లో దొరికేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చౌక దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేసే నిత్యావసర సరుకుల్లో భారీ కోత పెట్టింది. కందిపప్పు, గోధుమపిండి పంపిణీ మంగళం పాడింది. చక్కెర సైతం ప్రతి నెలా ఇవ్వడం లేదు.

కందిపప్పు కనుమరుగే

చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా... చౌక దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేసే నిత్యావసర సరుకుల్లో కోత వేస్తూనే ఉంటారు. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉండగా... 2014 జూన్ నుంచి 2015 జూలై వరకూ కందిపప్పు పంపిణీ గురించే పట్టించుకోలేదు. తర్వాత ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో 2018 నుంచి కందిపప్పు పంపిణీ మొదలు పెట్టారు. మళ్లీ ఇప్పుడు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చౌక డిపోల్లో కందిపప్పు కనమరుగైంది. కనీసం ఇప్పుడైనా రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై ఇచ్చే కందిపప్పు ప్రతి నెలా పంపిణీ చేయాలని కోరుతున్నారు.



జిల్లాలో రేషన్ కార్డులు, సరుకుల పంపిణీ ఇలా..

రేషన్ దుకాణాలు	1,367
రేషన్ కార్డులు	5,62,784
ప్రతి నెలా పంపిణీ చేయాల్సిన బియ్యం	8,700 మెట్రిక్ టన్నుల
ప్రతి నెలా ఇవ్వాల్సిన కందిపప్పు	5,72,517 కిలోలు
ప్రతి నెల అందించాల్సిన గోధుమ పిండి	5,72,517 కిలోలు

సరఫరా ఆగింది



చౌక డిపోలకు కందిపప్పు సరఫరా ఆగిన మాట వాస్తవమే. బియ్యం, చక్కెర ఇస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకాలకు కందిపప్పు పంపిణీ చేస్తున్నాం. పేదలందరికీ కందిపప్పు ఇచ్చేందుకు ప్రభుత్వం టెండర్లు పిలుస్తోంది. ఆ ప్రక్రియ పూర్తి కాగానే చౌక డిపోల ద్వారా కందిపప్పు పంపిణీ చేస్తాం. –వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

మీనాక్షి మెరుపులు



సినీ నటి మీనాక్షి చౌదరి ఆదివారం అనంతపురంలో సందడి చేశారు. ఓ కారు షోరూం ప్రారంభోత్సవానికి హాజరైన ఆమెను చూసేందుకు నగరవాసులు తరలివచ్చారు. సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు పోటీ పడ్డారు. నగరానికి రావడం ఎంతో ఆనందంగా ఉందని నటి మీనాక్షి చౌదరి తెలిపారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

నేడు లేపాక్షికి హైకోర్టు జడ్జి

లేపాక్షి: రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ టి.మల్లికార్జున రావు దంపతులు సోమవారం లేపాక్షి ఆలయాన్ని సందర్శించనున్నారని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం కదిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని.. సాయంత్రం లేపాక్షికి వస్తారని వెల్లడించారు. ఆలయ సందర్శన అనంతరం వారు పుట్టపర్తికి వెళతారని తెలిపారు.

చితికిన చెనిక్కాయ

జిల్లా రైతులతో దశాబ్దాలుగా పెనవేసుకుని ప్రధానపంటగా వెలుగొందుతున్న వేరుశనగ ప్రాభవం కోల్పోతోంది. గత పదేళ్లుగా క్రమంగా తగ్గుతూ వచ్చిన పంట విస్తీర్ణం ఈ ఖరీఫ్‌లో మరింత పతనమైంది. జిల్లా చరిత్రను తిరగేస్తే 1960 దశకం తర్వాత ఇదే అత్యల్ప విస్తీర్ణం కావడం గమనార్హం.

- 65 ఏళ్ల జిల్లా చరిత్రలో కనిష్ట సాగు
- లక్ష లోపు హెక్టార్లకు పరిమితమైన ప్రధానపంట
- నష్టాలతో సాగుపై రైతుల అనాసక్తి


వేరుశనగ పంట

అనంతపురం అగ్రికల్చర్: పెరిగిన పెట్టుబడులు, తగ్గుతున్న దిగుబడులు, గిట్టుబాటు ధరలు లభించకపోవడం, కూలీల సమస్య, చీడపీడల వ్యాప్తి, అడవిపందులు, జింకల బెడద, పంట నష్ట ఉపశమనం (స్కేల్ ఆఫ్ రిలీఫ్) తక్కువగా ఉండటం, అందులోనూ గరిష్టంగా రెండు హెక్టార్లకే ఇన్‌పుట్ ఇస్తుండటం, పంటల బీమా కింద పెద్దగా పరిహారం రాకపోవడం ఇలా కర్షకుడి చావుకు నవాలక్ష కారణాలు అన్న చందంగా క్రమంగా వేరుశనగ తన ప్రాశస్త్యాన్ని కోల్పోతూ వస్తోంది. ఒకానొక దశలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేరుశనగ సాగు విస్తీర్ణం 8 లక్షల నుంచి 9 లక్షల హెక్టార్ల గరిష్టస్థాయికి చేరుకుంది. జిల్లాలో ఎటు చూసినా వేరుశనగ మినహా మరో పంట కనిపించే పరిస్థితి లేకుండా శాసించింది. అక్కడక్కడా ఇతరత్రా పంటలు ఉన్నా వేరుశనగ మధ్యలో అంతర పంటలుగా మాత్రమే సాగవుతూ వచ్చాయి. అలా వేరుశనగ ఏకపంటగా విస్తరించి జిల్లాను పూర్తిగా ఆక్రమించింది. ప్రపంచంలో ఏ దేశంలో కూడా ఒక జిల్లాలో ఈ స్థాయిలో వేరుశనగ పంట పండించడం లేదని చెప్పేవారు. ఇలా 1960 దశకం నుంచి మొదలైన వేరుశనగ ప్రాభవం లక్షలాది హెక్టార్లతో 2015 వరకు అప్రతిహతంగా కొనసాగింది. అలాంటి పంట విస్తీర్ణం అనంతపురం జిల్లాలో ఈ ఖరీఫ్‌లో రెండో స్థానానికి దిగజారిపోయింది.

గత 30 ఏళ్లలో నాలుగుసార్లు గిట్టుబాటు..

అధికారిక లెక్కల ప్రకారం గత 30 ఏళ్లలో కేవలం నాలుగు సంవత్సరాల్లో వేరుశనగ మంచి దిగుబడులు రావడంతో గిట్టుబాటు అయింది. మరో ఏడేళ్లు పెట్టుబడులు దక్కించుకోగా తక్కిన 19 సంవత్సరాలు రైతులకు నష్టాలు మిగిల్చింది. సగటున ఎకరాకు 10 బస్తాలు లేదా హెక్టారుకు వేయి కిలోల వరకు వేరుశనగ దిగుబడులు వస్తేనే పంట బాగా వచ్చినట్లు లెక్క. 1995 నుంచి 2024 వరకు వేరుశనగ పంట దిగుబడులు పరిగణిస్తే అందులో 1995లో మాత్రం వేరుశనగ పంట బాగా పండింది. 1995లో హెక్టారుకు సగటున 1,310 కిలోల దిగుబడులు వచ్చాయి. ఆ తరువాత 1998లో 1,145 కిలోలు, 2000లో 1,116 కిలోలు, 2007లో 1,259 కిలోల దిగుబడులు వచ్చాయి. ఈ నాలుగేళ్లు పంట చేతికివచ్చింది. ఇక ఏడు సార్లు హెక్టారుకు 500 కిలోల నుంచి 950 కిలోల మధ్య రావడంతో పంటకు పెట్టిన పెట్టుబడులు దక్కాయి. ఇక తక్కిన 19 సార్లు వేరుశనగ దారుణంగా దెబ్బతిన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2006లో కేవలం 67 కిలోలు, 2008లో 88 కిలోలు... ఇలా 100 కిలోల లోపే దిగుబడులు రావడంతో ఎకరాకు అర బస్తా కూడా పండిన దాఖలాలు లేవు. ఈ క్రమంలో వేరుశనగ సమస్య పరిష్కారానికి 2012లో భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్) అప్పటి డైరెక్టర్ జనరల్ డాక్టర్ అయ్యప్పన్ నేతృత్వంలోని దేశవ్యాప్తంగా 18 మంది నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీ కూడా జిల్లాలో పర్యటించి వేరుశనగ సాగును తగ్గించి చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, గోరుచిక్కుడు లాంటి పంటలు వేయాలని సిఫారసు చేసింది.

కంది టాప్..

ఈ ఖరీఫ్‌లో కంది పంట చరిత్ర సృష్టిస్తూ సాగులో మొదటి స్థానంలో నిలిచింది. అనంతపురం జిల్లాలో 55,296 హెక్టార్లుగా అంచనా వేయగా రెండింతలు అధికంగా 1.05 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగులోకి రావడం గమనార్హం. కందితో పాటు ఆముదం, మొక్కజొన్న పంటల సాగు బాగా పెరుగుతూ వేరుశనగను వెనక్కినెట్టేస్తున్నాయి. ఈ ఖరీఫ్‌లో అన్ని పంటలు 3,43,232 హెక్టార్లలో సాగులోకి రావచ్చని అంచనా వేయగా... అనుకూల వర్షాల కారణంగా 88 శాతంతో 3.02 లక్షల హెక్టార్లకు చేరుకున్నాయి. అందులో కంది 1.04 లక్షల హెక్టార్లు, వేరుశనగ 91 వేల హెక్టార్లు, పత్తి 26 వేల హెక్టార్లు, మొక్కజొన్న 29 వేల హెక్టార్లు, ఆముదం 16 వేల హెక్టార్లు... ఈ ఐదు పంటలే 80 శాతం ఆక్రమించాయి. నీటి వసతి కింద 25 వేల హెక్టార్లలో వరి సాగులోకి వచ్చింది. ఇక సజ్జ, కొర్ర సాగు కొంచెం మెరుగ్గానే ఉన్నా... రాగి, జొన్న, పెసర, అలసంద, మినుము, సోయాబీన్, పొద్దుతిరుగుడు, నువ్వులు తదితర పంటలు నామమాత్రంగా సాగులోకి వచ్చాయి.

బినామీల కోసమే ప్రైవేటీకరణ


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

- చంద్రబాబు తీరుతో పేద విద్యార్థులకు అన్యాయం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: సీఎం చంద్రబాబు తన బినామీలకు లబ్ధి చేకూర్చడానికే వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు సిద్ధమయ్యారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ విమర్శించారు. ఆదివారం ఆమె మండలంలోని పందిపర్తి గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పేదల వైద్యానికి భరోసా కల్పించడంతో పాటు పేద విద్యార్థులు కూడా వైద్యవిద్య అభ్యసించాలన్న సదుద్దేశంతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో భారీసంఖ్యలో ప్రభుత్వ వైద్యకళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత సీఎం చంద్రబాబు వాటిని ప్రైవేటు పరం చేస్తున్నారని విమర్శించారు. పెనుకొండ వైద్య కళాశాలను పూర్తి చేస్తే ఈ ప్రాంతానికంతా మేలు జరుగుతుందని, ఆ దిశగా చొరవ చూపడంలో మంత్రి సవిత విఫలమయ్యారని విమర్శించారు. పైగా ఈ వైద్యకళాశాల నిర్మాణం విషయంలో ఇటీవల తప్పుడు ప్రచారం చేసి అభాసుపాలు అయ్యారని గుర్తు చేశారు. సూపర్‌సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు గజేంద్ర, శ్రీనివాసులు, మాజీ కన్వీనర్లు వెంకటరత్నం, నారాయణ రెడ్డి, సర్పంచులు కిష్టప్ప, జిలాన్, రామాంజి, సోము, వైస్ సర్పంచ్ వేణు, వైస్ ఎంపీపీ వెంకట నారాయణ రెడ్డి, స్థానిక నాయకులు సదాశివ రెడ్డి, రవీంద్ర రెడ్డి, రాజశేఖర్ , బాబు, నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పండగ పూట విషాదం


లక్ష్మణ సాయి (ఫైల్)


అరుణ్‌కుమార్ (ఫైల్)


తీవ్రంగా గాయపడిన చారుపల్లి బన్నీ

- ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీ
- ఇద్దరు యువకుల దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు

నల్లమాడ: దీపావళి పండగ పూట సంతోషంగా గడపాల్సిన ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మండలంలోని గోపేపల్లి వద్ద ఆదివారం తెల్లవారుజామున ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో నల్లమాడకు చెందిన ఇ.లక్ష్మణ సాయి (19), అరుణ్‌కుమార్ (19) అక్కడికక్కడే మృతిచెందారు. చారుపల్లి బన్నీ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, మృతుల సమీప బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. భవన నిర్మాణ కార్మికుడైన వెంకట నారాయణ కుమారుడు లక్ష్మణ సాయి, కూరగాయల వ్యాపారి కుల్లాయమ్మ కుమారుడు అరుణ్‌కుమార్, లేట్ గంగులప్ప కుమారుడు చారుపల్లి బన్నీ ముగ్గురు మంచి స్నేహితులు. స్థానిక గంగా థియేటర్ సమీపంలో ఒకే వీధిలో నివాసం ఉంటున్నారు. లక్ష్మణ సాయి ఇంటర్, అరుణ్‌కుమార్, బన్నీ పదో తరగతి వరకు చదివి..అనంతరం చదువు మానేశారు. బన్నీ కొన్ని నెలల క్రితం బెంగళూరుకు వలస వెళ్లి ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నట్లు తెలిసింది. లక్ష్మణ సాయి, అరుణ్‌కుమార్ ఇంటి వద్దనే ఉంటూ చిన్న చిన్న పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేవారు. చారుపల్లి బన్నీ బెంగళూరు నుంచి రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. శనివారం రాత్రి నల్లమాడలోని షిర్డీ సాయిబాబా గుడి వద్ద ఇతరులు చిన్నమ్మ కథ నాటకం ఏర్పాటు చేశారు. లక్ష్మణ సాయి, అరుణ్‌కుమార్, చారుపల్లి బన్నీ ముగ్గురూ ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు చిన్నమ్మ కథ నాటకాన్ని తిలకించారు.

బస్సు ఎక్కిద్దామని బయలుదేరి..

నాటకం నుంచి వచ్చిన తర్వాత.. బన్నీ బెంగళూరు వెళ్లడానికి కదిరిలో బస్సు ఎక్కించడానికి ముగ్గురూ కలిసి ఒకే ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. కదిరికి వెళ్లారో లేక ఏదైనా కారణంతో మార్గమధ్యం నుంచి ఇంటికి తిరుగుముఖం పట్టారో తెలియదు కానీ గోపేపల్లి వద్ద రోడ్డు మలుపులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. లక్ష్మణ సాయి, అరుణ్‌కుమార్ ఎగిరి సమీపంలోని బండరాళ్ల మీద పడటంతో ఇరువురికీ తల, ఛాతిపై తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన చారుపల్లి బన్నీని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కదిరి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. సీఐ నరేంద్రరెడ్డి తమ సిబ్బందితో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పంచనామా అనంతరం ఇదేరోజు సాయంత్రం లక్ష్మణ సాయికి నల్లమాడలో, అరుణ్‌కుమార్‌కు స్వగ్రామం నల్లసింగయ్యగారిపల్లిలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతులిద్దరూ ఏకైక సంతానం కావడంతో తల్లిదండ్రుల దుఃఖానికి అంతులేకుండా పోయింది.

క్లుప్తంగా

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

కదిరి టౌన్: ఆస్తి కోసం కన్నతల్లినే హతమార్చిన కేసులో ఆమె కుమారుడితో పాటు కోడలిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ నారాయణరెడ్డి ఆదివారం వెల్లడించారు. కదిరిలోని నిజాంవలీ కాలనీలో నివాసముంటున్న షేక్ ఖాశీంబీకి కుమారుడు, కుమార్తె ఉన్నారు. తాను అడిగిన డబ్బు, ఇంటి పత్రాలు ఇవ్వలేదన్న అక్కసుతో ఈ నెల 12న ఇంట్లో నిద్రిస్తున్న తల్లిని కొడుకు బాబాఫక్రుద్దీన్ కత్తితో పొడిచి హతమార్చి ఉడాయించాడు. ఘటనపై హతురాలి కుమార్తె అమ్మాజాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో బాబాఫక్రుద్దీన్, ఆయన రెండో భార్య రసూల్‌బీని ఆదివారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు


వరలక్ష్మి (ఫైల్)

ధర్మవరం అర్బన్: మరణానంతరం తన నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపును అందించారు ధర్మవరానికి చెందిన సురువు వరలక్ష్మి. వివరాలు... స్థానిక శారదా నగర్‌లో నివాసముంటున్న సురువు నాగరాజు 13 రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో మనోవేదనకు లోనైన ఆయన భార్య వరలక్ష్మి (50) ఆదివారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న విశ్వదీప సేవా సంఘం సభ్యులు.. మృతురాలి కుటుంబసభ్యులను కలిసి నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో మృతురాలి నేత్రాల నుంచి కార్నియాను జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర, కంటి వైద్యులు నరసింహులు సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతురాలి కుమారులు అశ్వత్థనారాయణ, సూర్యనారాయణ, కుమార్తె నాగేశ్వరి, బావ సత్యనారాయణ, తమ్ముళ్లు పార్థసారథి, జయచంద్ర, తిమ్మరాజుకు విశ్వదీప సేవా సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకుడు కోళ్లమొరం చంద్రశేఖరరెడ్డి, అధ్యక్షుడు సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో గస్తీ చేపట్టాలి


కొత్తచెరువు పీఎస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తి: రాత్రి వేళల్లో ముమ్మర గస్తీ చేపట్టి చోరీల నివారణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. పుట్టపర్తి రూరల్ పరిధిలోని కొత్తచెరువు, బుక్కపట్నం పోలీస్ స్టేషన్లను శనివారం రాత్రి ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్, తనిఖీలపై ఆరా తీశారు. ప్రతి గ్రామంలోనూ తనిఖీలు చేపట్టాలని సూచించారు.

పరిశ్రమలో పోలీసుల ముమ్మర తనిఖీలు

హిందూపురం: ఓ కంపెనీ అనుమతి పొందిన పైపులను అనధికారికంగా ఉత్పత్తి చేస్తున్న హిందూపురంలోని తూముకుంట పారిశ్రామిక వాడలోని హెచ్‌టీఎల్ మెటల్ సూర్యరోషిణి కంపెనీలోని హిందూపురం రూరల్ పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. అనధికార ఉత్పత్తిపై గత నెల 19న హిందూపురం రూరల్ పోలీసులకు రాధాకృష్ణ జీకే ట్యూబ్స్ కంపెనీ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టు ఉత్తర్వుల మేరకు రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖ అధికారులతో కలసి తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో అనధికారికంగా ఉత్పత్తి చేసిన 5 వేల స్టీల్ పైపులను సీజ్ చేసినట్లు తెలిసింది.

పోలీస్ అమరవీరులకు వందనం

- మీ త్యాగాలు మరవలేం
- శాంతిభద్రత నిర్వహణలో పోలీసుల పాత్ర కీలకం
- రేపు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం



జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం

పుట్టపర్తి టౌన్: అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ శాంతిభద్రతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంలో పోలీసులది కీలక పాత్ర. ప్రజలకు రక్షణ కల్పించే క్రమంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. అలాంటి వారి సేవలను స్మరించుకునేందుకు ఏటా అక్టోబర్ 21న పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు జోహార్లు అర్పిస్తూ స్మారకోత్సవాలను ఘనంగా నిర్వహించేలా జిల్లా పోలీసు శాఖ ఏర్పాట్లు చేసింది. రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ అమరులైన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 7.30 నుంచి 10గంటల వరకు సమావేశం నిర్వహించి ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించనున్నారు.

ఆ త్యాగం మరువలేం

భారత, చైనా సరిహద్దులోని లడక్ ప్రాంతంలో 1959 అక్టోబరు 21న చైనా సైనికుల దాడిలో పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు నేలకొరిగారు. వారి మృతదేహాలను సొంత ప్రాంతాలకు తరలించలేని పరిస్థితి. దీంతో అక్కడే ఖననం చేశారు. వారి త్యాగాలకు గుర్తుగా అప్పటి నుంచి ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. పది రోజుల పాటు సాగే పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలను చేపట్టనున్నారు. 21న జిల్లా పోలీసు కార్యాలయంలో కార్యక్రమాన్ని ఎస్పీ సతీష్‌కుమార్ ప్రారంభించనున్నారు. 22, 23తేదీల్లో జిల్లాలో అమరులైన పోలీసుల గ్రామాలను సందర్శించి, నివాళులర్పించనున్నారు. అనంతరం 24 నుంచి 27వ తేదీ వరకూ విద్యార్థులకు చర్చావేదికలు, వక్తృత్వ పోటీలు, 26న 26న పోలీసుల పరాక్రమాలు, త్యాగాలు తెలిపే చిత్రాల ప్రదర్శన, 26 నుంచి 27 వరకు ఓపెన్ హౌస్, 28న వైద్య శిబిరాలు, అదే రోజు పోలీస్ వాయిద్య బృందాల ప్రదర్శన, 29న పోలీస్ త్యాగాలపై సెమినార్లు, 30న పోలీస్ అమరవీరుల కుటుంబాల్లోని సాధకులకు సన్మానం, 31న సమైక్యతా దినం పాటించి వారోత్సవాలు ముగించనున్నారు.

జిల్లాలో ఇద్దరు అమరులు

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో భాగంగా కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, బాబావలి అమరులయ్యారు. 1992లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికైన ఆర్.బాబావలి... హైదరాబాద్, ఢిల్లీ నగరాల్లో ఉన్న పోలీస్ కారిడార్‌లో గన్‌మెన్‌గా శిక్షణ పొంది పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలకు అంగరక్షకుడిగా పనిచేశారు. 2003, జనవరి 18న అనంతపురంలో గుర్తు తెలియని దుండగుల చేతిలో వీరమరణం పొందారు. ఆయన సేవలకు గుర్తుగా ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయించి, ఆయన భార్యకు ఎక్సైజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పించింది. అలాగే 1994లో కానిస్టేబుల్‌గా విధుల్లోకి చేరిన తాటిపి చంద్రశేఖర్.. చిలమత్తూరు, రామగిరి పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. 2003, సెప్టెంబర్ 23న చంద్రశేఖర్‌తో పాటు మరో కానిస్టేబుల్ హనుమంతును మావోయిస్టులు కిడ్నాప్ చేశారు. ఆ తరువాత హనుమంతుని విడుదల చేశారు. ఆ మరుసటి రోజు సోమరవాండ్లపల్లి అటవీ ప్రాంతంలో చంద్రశేఖర్ మృతదేహం లభించింది. అమరుడైనా చంద్రశేఖర్ కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించింది.

పోలీస్ అంటేనే బాధ్యత



పోలీస్ ఉద్యోగం అంటే బాధ్యతతో కూడుకున్నది. ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణలో భాగంగా కొన్నిసార్లు అసాంఘిక శక్తుల చేతుల్లో వీరమరణం పొందక తప్పదు. వారి త్యాగాలు గుర్తు చేసుకొనేందుకు పోలీసుల అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నాం ఈ నెల 31 వరకు అన్ని పోలీస్ స్టేషన్లలో అమరవీరుల వారోత్సవాలు జరుగుతాయి.

– సతీష్‌కుమార్, ఎస్పీ

బేల్దారి ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

ముదిగుబ్బ: మండల కేంద్రంలో నివాసముంటున్న రమేష్ (36) ఆత్మహత్య చేసుకున్నాడు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న ఆయనకు భార్య లత, ఓ కుమారుడు ఉన్నారు. శనివారం దంపతుల మధ్య చోటు చేసుకున్న గొడవ కారణంగా కుమారుడిని పిలుచుకుని స్థానికంగానే ఉన్న పుట్టింటికి భార్య వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన రమేష్ ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, రమేష్‌కు ఇది వరకే రెండు పెళ్లిళ్లు అయ్యాయి. మనస్పర్థల కారణంగా వారు వదిలి వెళ్లారు. దీంతో ఇది వరకే పెళ్లి అయి భర్తకు దూరంగా ఉంటున్న లతను మూడో పెళ్లి చేసుకున్నాడు. అయితే రమేష్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతుడి తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆంధ్ర, ఢిల్లీ మ్యాచ్ డ్రా

అనంతపురం కార్పొరేషన్: సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా అండర్ –23 ఆంధ్ర, ఢిల్లీ జట్ల మధ్య జరిగిన నాలుగు రోజు మ్యాచ్ డ్రా ముగిసింది. ఆంధ్ర జట్టు ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించడం విశేషం. ఆదివారం అనంత క్రీడా గ్రామంలో నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 200/5తో ఆట ప్రారంభించిన ఢిల్లీ జట్టు 126 ఓవర్ల వద్ద 394 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో దేవ్ లక్రా సెంచరీతో కదం తొక్కాడు. 220 బంతులను ఎదుర్కొని 16 ఫోర్లు, 3 సిక్సర్లతో 158 పరుగులు సాధించాడు. అతనికి తోడుగా క్రిషియాదవ్ 70 పరుగులు చేశాడు. ఆంధ్ర బౌలర్లలో పి.ఆదిత్యరెడ్డి 3, సాయిశ్రావణ్ 3, జి.సుమిత్ 2 వికెట్లు కూలదోశారు. అనంతరం ఆంధ్ర జట్టు తమ రెండో ఇన్నింగ్స్‌లో 8 ఓవర్లలో వికెట్ నష్టపోయి 43 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అనంతరం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో మ్యాచ్ రెఫరీ సంజయ్ వర్మ మాట్లాడారు. బీసీసీఐ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలను జిల్లా క్రికెట్ సంఘం పక్కాగా అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

కదిరి టౌన్: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మృతుడిని కదిరిలోని నిజాంవలి కాలనీకి చెందిన మౌలాలీ (30)గా గుర్తించినట్లు కదిరి జీఆర్పీ ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం రాత్రి నిజాంవలీ కాలనీ సమీపంలో పట్టాలపై తచ్చాడుతుండగా తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొన్న కారు

- ఒకరి పరిస్థితి విషమం, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



రాప్తాడు: రోడ్డు పక్కన నిలిపిన లారీని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు..... రాప్తాడు సమీపంలోని మహేంద్ర షోరూం ఎదురుగా 44వ జాతీయ రహదారి పక్కన ఆదివారం మధ్యాహ్నం 1 గంట సమయంలో ఓ కంటైనర్‌ను డ్రైవర్ ఆపాడు. అదే సమయంలో బెంగళూరు నుంచి అనంతపురం వైపుగా వెళుతున్న కారు... లారీని వెనుక నుంచి ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న తమిళనాడుకు చెందిన రాజ్ కుమార్, ఆయన భార్య లలిత, కుమారుడు శబరీష్ తీవ్రంగా గాయపడ్డారు. కారు డ్రైవ్ చేస్తున్న తండ్రి పక్క సీటులో కూర్చొన్న కుమారుడి పరిస్థితి విషమంగా మారింది. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా తొలుత అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం శబరీష్‌ను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మారుతి సుజుకి- నివ్యా ఆటోమొబైల్స్ షోరూం ప్రారంభం

- మెరిసిన సినీనటి మీనాక్షి చౌదరి


మారుతి సుజుకి మిడ్ - ఎస్‌యూవీ విక్టోరిస్‌ను ఆవిష్కరిస్తున్న హీరోయిన్ మీనాక్షి చౌదరి, ఎంపీ అంబికా, నివ్యా ఆటో మొబైల్స్ ఎండీ మల్లు ప్రసాద్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్: నగర శివారులోని శిల్పారామం వద్ద జాతీయ రహదారి పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన 'మారుతి సుజుకి అరెనా–నివ్యా ఆటో మొబైల్స్ షోరూం'ను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా హీరోయిన్ మీనాక్షి చౌదరి ముఖ్య అతిథిగా హాజరై అలరించారు. సినిమా పాటకు స్టెప్పులేసి అదరగొట్టారు. ఆమెను చూడటానికి యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం మారుతి సుజుకి మిడ్ – ఎస్‌యూవీ విక్టోరిస్‌ను మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ మారుతి సుజుకి మొదటి నుంచి ఎంతో నమ్మకమైన బ్రాండ్ అన్నారు. తన ప్రయాణం చిన్నప్పుడు మారుతి 800తో మొదలైందని గుర్తు చేసుకున్నారు. జీవితమనేది చాలా విలువైనదని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తొలిసారిగా పెట్రోల్ కార్లను మారుతి సంస్థ ప్రవేశపెట్టడం గొప్ప విషయమన్నారు. నివ్యా ఆటో మొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లు ప్రసాద్‌రెడ్డి, మల్లు నివేదితా రెడ్డి మాట్లాడుతూ కొత్త అరెనా షోరూమ్‌లో సేల్స్, సర్వీస్, స్పేర్ పార్ట్స్ అన్నీ ఒకేచోట లభిస్తాయని తెలిపారు. నూతన మారుతి సుజుకి విక్టోరిస్ కారు స్ట్రాంగ్ హైబ్రిడ్, మైల్డ్ హైబ్రిడ్ సీఎన్‌జీ, ఆల్‌గ్రిప్ వేరియంట్లలో అందుబాటులో ఉందన్నారు. దీని ధర రూ.10.49 లక్షల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

నేడు పరిష్కార వేదిక ఉండదు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రశాంతి నిలయం: దీపావళి పండుగ సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవు ఉన్నందున కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం లేదని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. అర్జీలు ఇచ్చేందుకు జిల్లా కేంద్రానికి రావొద్దని కోరారు. జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

చిరుత దాడిలో దూడల మృతి

కళ్యాణదుర్గం: మండలంలోని మల్లాపురంలో చిరుతదాడిలో రెండు దూడలు మృతిచెందాయి. వివరాలు.. మల్లాపురం గ్రామానికి చెందిన రైతు ఆటో వెంకటేష్.. గ్రామ సమీపంలోని తన తోటలో రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం ఆవులు, దూడలను కట్టేసి ఇంటికెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో పశువుల పాకలోకి చొరబడిన చిరుత రెండు దూడలను చంపేసింది. ఓ దూడను సగానికి పైగా తినేసింది. ఆదివారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించి రైతు లబోదిబోమన్నాడు. గతంలోనూ ఓ ఆవును చిరుత చంపేసిందని, ప్రస్తుతం రెండు దూడలు మృతి చెందాయని కన్నీటిపర్యంతమయ్యాడు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన ఎద్దును చూపుతున్న రైతు

తాడిపత్రిటౌన్: మండలంలోని యర్రగుంటపల్లిలో ఆదివారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై ఎద్దు మృతి చెందింది. వివరాలు గ్రామానికి చెందిన రైతు బాలక్రిష్ణకు చెందిన ఎద్దు నీటి సంపు వద్ద పచ్చిగడ్డి మేస్తూ అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి చనిపోయింది. తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు ఉండటం వల్లే ఎద్దు మృతి చెందిందని, దాదాపు రూ.80 వేలు నష్టపోయానని బాధితుడు ఆరోపించాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరాడు.

పండగకు ఇంటికి వద్దన్నారని...

చిలమత్తూరు: పండుగ పూట ఇంటికి వద్దని తల్లిదండ్రులు వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన కేజీబీవీ విద్యార్థిని పాఠశాల వదిలి వెళ్లిపోయింది. సకాలంలో పోలీసులు గుర్తించి సురక్షితంగా పాఠశాలకు చేర్చడంతో అప్పటి వరకూ కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. వివరాల్లోకి వెళితే.. లేపాక్షి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక చిలమత్తూరులోని కేజీబీవీలో 7వ తరగతి చదువుతోంది. కుమార్తె బాగోగులను తెలుసుకునేందుకు ఆదివారం తల్లిదండ్రులు కేజీబీవీకి చేరుకున్నారు. ఆ సమయంలో దీపావళి పండుగకు ఇంటికి వస్తానని బాలిక తెలపడంతో తల్లిదండ్రులు అంగీకరించి రిజిస్టర్‌లో నమోదు చేయించారు. అనంతరం కాసేపటి తర్వాత ఒక్క రోజు సెలవు కావడంతో వద్దని నిర్ణయించుకుని కుమార్తెకు నచ్చచెప్పి పాఠశాలలోనే వదిలి వెళ్లిపోయారు. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థిని పాఠశాల నుంచి తప్పించుకుని అటవీ ప్రాంతం వైపుగా వెళ్లింది. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన ఎస్‌ఓ సునీత అప్రమత్తమయ్యారు. వెంటనే సిబ్బందిని నలువైపులా పంపి గాలింపు చేపట్టారు. విద్యార్థిని మిస్సింగ్ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశం వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో విద్యాశాఖ అధికారులూ అప్రమత్తమయ్యారు. చివరకు అటవీ శివారు ప్రాంతాల్లో ఏడ్చుకుంటూ వెళుతున్న బాలికను గుర్తించిన పోలీసులు వెంటనే ఆధీనంలోకి తీసుకుని వివరాలు ఆరా తీశారు. కేజీబీవీ విద్యార్థినిగా గుర్తించి పాఠశాలకు చేర్చారు. దీంతో అప్పటి వరకూ నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.

పుట్ట గొడుగుల పెంపకం లాభదాయకం


సర్టిఫికెట్లు అందజేస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం: పుట్ట గొడుగుల పెంపకం లాభదాయమని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ సూచించారు. మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో పుట్ట గొడుగులకు డిమాండ్ ఉందన్నారు. నిరుద్యోగ యువత పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ పొంది కుటీర పరిశ్రమలాగ అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి పుట్ట గొడుగుల పెంపకంలో మెలకువలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్లు అందజేశారు.

జీవన ఎరువుల వాడకం ఎంతో మేలు

రసాయన మందులకంటే జీవన ఎరువులు వాడకం ఎంతో మేలు అని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి సూచించారు. మండలంలోని రెడ్డిపల్లి కేవీకేలో జీవన ఎరువుల వారోత్సవాల సందర్భంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ జీవన ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ, ఎరువుల లభ్యత, పథకాలపై కేవీకే విస్తరణా శాస్త్రవేత్త చందన అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల సాగుపై వాటిలో రాయితీలపై శాస్త్రవేత్త డాక్టర్ మాధవి వివరించారు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రాకారోత్సవం


ప్రాకారోత్సవంలో భాగంగా ఊరేగించారు. భక్తులు హాజరై ఉత్సవాన్ని తిలకించారు.

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రాకారోత్సవం ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని మూలమూర్తుల ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ మూర్తులైన పార్వతీ, బుగ్గ రామలింగేశ్వరస్వామి వార్లను వివిధ రకాల పూలమాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను

సేవ పేరుతో దోపిడీ

భక్తుల సెంటిమెంట్‌ను ఆదాయ వనరుగా మార్చుకున్నారు కొందరు స్వార్థపరులు. సేవ పేరుతో చందాలు వసూలు చేస్తూ అక్రమార్జనకు తెరలేపారు. ఇందుకు ఉమ్మడి జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రం వేదికగా చేసుకున్నారు. ఆలయం దేవదాయ శాఖ పరిధిలో ఉన్నా... పెత్తనం మొత్తం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉండడంతో భక్తులకు అసౌకర్యాలు తప్పడం లేదు.

- పంపనూరు క్షేత్రంలో అక్రమార్కుల దందా
- భక్తుల సెంటిమెంట్‌తో వ్యాపారం
- అనధికారికంగా గోశాల, అన్నదానం నిర్వహణ
- సేవ పేరుతో రూ. లక్షల్లో వసూళ్లు
- ఆడిట్ వివరాలు లేవంటున్న ఎండోమెంట్ అధికారులు


ఆలయం వద్ద అనధికారికంగా నిర్వహిస్తున్న గోశాల


అనధికార వసూళ్లకు ఏర్పాటు చేసిన టేబుల్ (ఇన్‌సెట్) విరాళానికి ఇచ్చే రసీదు

ఆత్మకూరు: ఉమ్మడి జిల్లాలోనే కాకుండా కర్ణాటకలోనూ భక్తుల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న ఆత్మకూరు మండలం పంపనూరులో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్ర ప్రతిష్టను కొందరు స్వార్థపరులు దిగజారుస్తున్నారు. దేవదాయశాఖ పరిధిలోని ఈ ఆలయంలో పెత్తనమంతా ప్రైవేట్ వ్యక్తులదే కావడం గమనార్హం. ప్రతి వారమూ రూ.లక్షల్లో ఆదాయం ఉన్నా... ఆ ఆదాయం ఏమవుతుందో ఎవరికీ అంతు చిక్కడం లేదు. ఒక్కప్పుడు 3.90 ఎకరాల్లో విస్తరించిన ఈ ఆలయం.. ప్రస్తుతం 50 సెంట్లకు మించి లేదు. మిగిలిన ప్రదేశంలో అనధికార గోశాల, అన్నదాన కమిటీ అంటూ ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకున్నారు. స్వామికి సేవ చేస్తున్నామనే పేరుతో నెలకు రూ. లక్షల్లో దోపిడీ సాగిస్తున్నారు.

పెత్తనమంతా వారిదే..

దశాబ్దాలుగా పంపనూరు ఆలయంలో ప్రైవేటు వ్యక్తుల హవా కొనసాగుతోంది. ఇదేమని అడిగితే స్వామి వారికి సేవ చేస్తున్నామని చెబుతున్నారు. దేవదాయ శాఖకు ఎలాంటి సంబంధం లేకుండా ఆలయంలో గోశాల నిర్వహణ, అన్నదానం అంటూ కమిటీలు ఏర్పాటు చేశారు. గోశాలను ఆదినారాయణ నాయుడు, అన్నదాన కమిటీని సత్య రంగయ్య అనధికారికంగా నిర్వహిస్తున్నారు. గోశాలలో ప్రస్తుతం 60 వరకు ఆవులు ఉన్నాయి. ఆలయానికి వచ్చే భక్తులను గోపూజ పేరుతో ఆకర్షిస్తూ మేత, ఇతర పోషణకు రోజుకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇక చందాల రూపంలో అయితే 15 రోజులకు రూ.300, 30 రోజులకు రూ.500, 90 రోజులకు రూ.1,200 అంటూ బోర్డులు పెట్టి మరీ వసూలు చేస్తున్నారు. అయితే ఆవులకు మేత, ఇతర పోషణ ఖర్చులు మొత్తం ఆలయ నిర్వహణ ద్వారానే సమకూరుతుండడం గమనార్హం. ఇక అన్నదాన కమిటీకు సంబంధించి ఆలయంలోనే మూడు ప్రదేశాల్లో టేబుళ్లు వేసుకుని చందాలు వసూలు చేస్తున్నారు. ఇందుకు రసీదు కూడా ఇస్తున్నారు. అయితే వీటికి సంబంధించి ఎలాంటి ఆడిట్ ఉండదు. భక్తుల సెంటిమెంట్‌ను తెలివిగా వ్యాపారంగా మార్చి నిలువు దోపిడీ చేస్తున్నారు.

రికార్డులంటూ ఏమీ ఉండవు..

అనధికారికంగా నిర్వహిస్తున్న గోశాల, అన్నదాన కమిటీలకు సంబంధించి ఎలాంటి రికార్డులు ఉండవు. గోశాల, అన్నదాన కమిటీలకు వారానికి రూ.లక్షల్లోనే ఆదాయం సమకూరుతోంది. ఈ ఆదాయానికి సంబంధించి జమా ఖర్చులపై నిర్వాహకులు కానీ, దేవదాయ శాఖ ఈఓ కాని సరైన వివరాలు వెల్లడించలేకపోతున్నారు. గోశాల, అన్నదాన కమిటీలకు దాతలు, భక్తులు విరాళంగా ఇచ్చిన నగదు ప్రస్తుతం ఎంత మేర ఉందో కూడా స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. ఈ అంశంపై ఇటీవల నిర్వాహకులను పంపనూరు గ్రామస్తులు నిలదీశారు. ఆ సమయంలో వారికి సరైన సమాధానాలు ఇవ్వలేక నిర్వాహకులు వాగ్వాదానికి దిగారు. ఆలయ ఈఓ బాబు సైతం స్పందించకుండా ఎండోమెంట్‌తో అన్నదాన కమిటీ, గోశాలకు ఎలాంటి సంబంధం లేదని తప్పించుకున్నారు. ఈ మొత్తం గోల్‌మాల్ వ్యవహారాన్ని ఎండోమెంట్ అధికారులు అత్యంత గోప్యంగా ఉంచడం వెనుక మర్మమేమిటో సుబ్రహ్మణ్యేశ్వరుడికే తెలియాలని భక్తులు అంటున్నారు. అక్రమాలు పెచ్చుమీరుతున్నా.. దేవదాయ శాఖ ఈఓ మాత్రం తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం ప్రస్తుతం వివాదాస్పదమవుతోంది. ఇదంతా గమనించిన భక్తులు ఆలయ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆలయ ప్రతిష్ట దిగజారుస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.